ఏవీ ఆ గాండ్రింపులు..!

- ఏఆర్‌సీలో తగ్గిన జంతువుల సంఖ్య
- 64 వన్యప్రాణులకు మిగిలినది ఒక్క ఆడ సింహమే



మిగిలిన ఆడ సంహం(ఫైల్)



ఏఆర్‌సీ లోపల ఖాళీ బోన్లు



జంతు పునరావాస కేంద్రం(ఏఆర్‌సీ)

ఆరిలోవ : జంతు పునరావాస కేంద్రం(ఏఆర్‌సీ)లో దశాబ్దాలుగా వినిపించే పెద్ద పులులు, సింహాల గాండ్రింపులు, గర్జనలు ఇప్పుడు మూగబోయాయి. ఇక్కడ పదుల సంఖ్యలో ఆవాసం పొందే మృగరాజులు, పెద్ద పులులు ఇప్పుడు తగ్గిపోయాయి. ఉన్న ఒక్క ఆడ సింహం కూడా వృద్ధాప్యంతో అరవడానికి శక్తిలేక కాలం వెళ్లదీస్తోంది.

68 వన్యప్రాణులకు ఆవాసం

జాతీయ రహదారి పక్కన ఇందిరాగాంధీ జూలాజికల్ పార్కు సమీపంలో 2000లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో రాష్ట్ర అటవీ శాఖ అధికారులు సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో జంతు పునరావాస కేంద్రాన్ని(యానిమల్ రెస్క్యూ సెంటర్-ఏఆర్‌సీ) నిర్మించారు. దీని నిర్వహణ బాధ్యతలను జూ పార్కు అధికారులకు అప్పగించారు. ఇక్కడ నిర్మాణం పూర్తయిన అనంతరం 2001లో దీన్ని ప్రారంభించారు. ఈ కేంద్రానికి అప్పట్లో 34 పెద్ద పులులు, 34 సింహాలను దేశంలో పేరొందిన సర్కస్ కంపెనీల నుంచి సేకరించి తీసుకొచ్చారు. వాటి కోసం ప్రత్యేకంగా ఇనుప కేజ్‌లు, నైట్‌క్రాల్స్ నిర్మించారు. అవి బహిరంగంగా తిరగడానికి ఇక్కడ విశాలమైన ఎన్‌క్లోజర్లు నిర్మించారు. వాటికి రోజూ సకాలంలో ఆహారం అందిస్తుండేవారు. అనారోగ్యానికి గురైతే వైద్యం చేస్తుండేవారు. ప్రతి రోజూ వాటికి వైద్య సంరక్షణ జరుగుతూనే ఉంటుంది. వాటి కోసం ప్రత్యేకంగా వెటర్నరీ ఆస్పత్రి ఈ కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఒక వైద్యుడు, సహాయకులు, జంతు సంరక్షకులను నియమించారు. అవి అప్పట్లో యుక్త వయస్సులో ఉండడంతో గాండ్రింపులు, గర్జనలతో ఏఆర్‌సీ మార్మోగేది. జాతీయ రహదారిపై ప్రయాణించేవారికి ఆ గర్జనల హోరు వినిపించేది. అయితే ప్రస్తుతం వాటి సంఖ్య తగ్గిపోయింది. పదుల సంఖ్యలో ఉండే వాటి సంఖ్య సింగిల్‌కు చేరింది. దీంతో ఆ గర్జనలు, గాండ్రింపులు వినిపించడంలేదు. సాధారణంగా అడవుల్లో వాటి జీవిత కాలం కంటే ఇక్కడ సంరక్షణలో ఎక్కువ కాలమే జీవించాయి. సహజంగా అడవుల్లో పులులు, సింహాలు 15 నుంచి 16 సంవత్సరాలు జీవిస్తాయి. ఇక్కడ 25 ఏళ్లకు పైగా వయసు మీరి జీవించాయి. 26 ఏళ్ల అర్జున్, కొనాల్ అనే రెండు మగ సింహాలు, 25 ఏళ్ల మాధురి, 23 ఏళ్ల వయసు గల సుధ, రాణి అనే ఆడ సింహాలు జీవించాయి. వీటితో పాటు 23 ఏళ్ల వయసు గల ఆడ పులి, 19 ఏళ్ల వయసుగల వినయ్ అనే మగ పులి ఉండేవి. 26 ఏళ్ల అర్జున్ అనే సింహానికి పెరాలసిస్ రావడంతో వైద్యం అందించారు. అనారోగ్యంతో ఉన్న 23 ఏళ్ల సీత అనే పులికి వైద్య సేవలు అందించారు. దీంతో అవి ఎక్కువ కాలం జీవించాయని ఇక్కడ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ ఏఆర్‌సీలో ఒకే ఒక్క ఆడసింహం మాత్రమే మిగిలింది. అది కూడా వృద్ధాప్యంతో కాలం గడుపుతోంది. దాదాపు ఈ ఏఆర్‌సీ ఖాళీ అయిపోనట్టే. ఖాళీగా ఉన్న ఈ కేంద్రంలో ప్రస్తుతం జూలో అదనంగా నైట్‌క్రాల్స్‌లో ఉండే కొన్ని తెల్ల పులులు, ఎలుగుబంట్లును ఇక్కడ సంరక్షణలో ఉంచారు. ఇతర దేశాలు, రాష్ట్రాల్లోని జూ పార్కుల నుంచి తీసుకొచ్చిన కొత్త జంతువులను ఏఆర్‌సీలో క్వారెంటైన్ కోసం ఉంచుతున్నారు.

ఇదీ నేపథ్యం

ఇందిరాగాంధీ జూ పార్కు సమీపంలో జాతీయ రహదారిని ఆనుకొని 2000లో జంతు పునరావాస కేంద్రం(ఏఆర్‌సీ) ఏర్పాటు చేశారు. అప్పట్లో సర్కస్ కంపెనీలు గ్రామాలు, పట్టణాలకు వచ్చి రాత్రి వేళ ప్రజలకు వినోదం పంచేవి. ఆ కంపెనీల్లో పులులు, సింహాలు, ఎలుగుబంట్లు, కోతులు, కుక్కలను తీసుకొచ్చి వాటితో విన్యాసాలు చేయించేవారు. ఈ మూగ జీవాలు సర్కస్ యాజమాన్యాల హింసకు గురవుతున్నట్లు భావించిన కేంద్ర ప్రభుత్వం సర్కస్ కంపెనీలలో జంతువులతో విన్యాసాలు చేయించడాన్ని తప్పుపట్టింది. దీంతో సర్కస్ కంపెనీలలో పులులు, సింహాలను ఆడించకూడదని 2000లో అప్పటి కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. దేశంలో ఉన్న సర్కస్ కంపెనీలలో ఏయే జంతువులు ఉన్నాయో వాటిన్నింటిని సేకరించింది. వాటి కోసం దేశంలో ప్రత్యేకంగా ఐదు చోట్ల జంతు పునరావాస కేంద్రాల(ఏఆర్‌సీ)ను నిర్మించింది. విశాఖపట్నం, తిరుపతి, మైసూరు, ముంబయి, చెన్నైలలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దేశంలో పేరొందిన ఫేమస్, జెమిని, అజంతా తదితర సర్కస్ కంపెనీల నుంచి సేకరించిన పులులు, సింహాలను ఆయా ఐదు ఏఆర్‌సీలకు తరలించింది. ఆయా కేంద్రాలలో అప్పటి నుంచి వాటికి ఆవాసం కల్పించడంతో పాటు ఆహారం, వైద్యం, సంరక్షణ అందిస్తున్నారు.

క్లుప్తంగా

నమ్మండి.. ఇది బొమ్మండి.!



జూ పార్కులో సీతాకోక చిలుక బొమ్మ

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో ఓ పెద్ద సీతాకోక చిలుక సందర్శకులను ఆకట్టుకుంటోంది. జూలో నీటి ఏనుగుల ఎన్‌క్లోజరు ఎదురుగా సీతాకోక చిలుకల పార్కు ఉంది. ఇందులో పచ్చని మొక్కలు, పూల మొక్కలపై సీతాకోక చిలుకలు ఎగురుతూ సందర్శకులను అలరిస్తుంటాయి. ఈ పార్కు ముందు ఎగరలేని మరో పెద్ద సీతాకోక చిలుక కనిపిస్తుంది. దాని దగ్గరకు వెళ్లే వరకు బొమ్మ చిలుక అని గుర్తుపట్టలేము. సీతాకోక చిలుకల పార్కు ముందు జూ అధికారులు ఇటీవల పెద్ద సైజులో ఉండే సీతాకోక చిలుక బొమ్మను ఏర్పాటు చేశారు. జూకు వెళ్లే సందర్శకులను ఈ బొమ్మ ఆకట్టుకుంటోంది. పిల్లలు ఇక్కడ సెల్ఫీలు తీసుకుని ముచ్చట పడుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన 33/11 కేవీ పరిధి 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ, హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ వెళ్లే మార్గంలో విద్యుత్ స్తంభాల తరలింపు పనులు చేపట్టనున్న దృష్ట్యా సోమవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ సందర్భంగా విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, బీఎస్‌ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాల లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

భూహక్కు చట్టంపై నిరసన

బీచ్ రోడ్డు: భూయాజమాన్య హక్కుల చట్టం -2022ను నిరసిస్తూ ఆదివారం బీచ్ రోడ్డులో పలువురు న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ఈ నిరసన కార్యక్రమం కొనసాగింది. భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

సీతమ్మధార: నగర కమిషనర్ డా.రవిశంకర్, అడిషనల్ కమిషనర్ వెంకటరావు(స్పెషల్ బ్రాంచ్) ఆదేశాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా గంజాయి తరలిస్తున్న యువకుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వేస్టేషన్ మెయిన్ గేటు వద్ద అల్లూరి సీతారామరాజు జిల్లా అట్లగూన గ్రామం అరకుకు చెందిన పంగి గోపినాథ్ అనే యువకుడు అరకు నుంచి బెంగుళూరుకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నాడని సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఆదేశాల మేరకు ఎస్ఐ భరత్ కుమార్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. యువకుడు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా.. నాలుగు కిలోల గంజాయి, ఒక సెల్‌ఫోన్ ఉన్నట్లు గుర్తించి ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఫోర్త్‌టౌన్ సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార: ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఐదుగురిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి సుబ్బలక్ష్మీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో గల ఒక ఫ్లాట్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు సోదాలు నిర్వహించారు. అక్కడ పేకాటాడుతున్న కంచరపాలెం ఇందిరానగర్‌కు చెందిన కడగల రామకృష్ణ, గాజువాక కర్ణవానిపాలేనికి చెందిన ఎస్.భీమరాజు, తాటిచెట్లపాలెం ఆంజనేయ స్వామి ఆలయం వెనుక వీధికి చెందిన వేకి శ్రీనివాసరావు, కంచరపాలెం గజపతినగర్‌కు చెందిన బోరులపల్లి శ్రీనివాసరావు, దొండపర్తి సుబ్బలక్ష్మీనగర్‌కు చెందిన రఘుమండ మోహన్‌రావులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.34,700 నగదు స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తిగత దూషణలు చేస్తే సహించం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై వ్యక్తిగత దూషణలు చేసే వారు ముందు తమ స్థాయి ఎంటో తెలుసుకొని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ తూర్పు మహిళా విభాగం నాయకులు హెచ్చరించారు. తూర్పు టీడీపీ మహిళా అధ్యక్షురాలు ఎంపీ ఎంవీవీని దూషిస్తూ చేసిన వ్యాఖ్యలను వారు ఆదివారం విలేకరుల సమావేశంలో ఖండించారు. ఇంటికొచ్చి చెప్పులతో కొడతాం అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. ఆమె స్థాయి ఏంటో తెలుసుకోవాలని సూచించారు. పార్టీలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఎంవీవీ విశాఖ ఎంపీగా గెలిచి చరిత్ర సృష్టించారన్నారు. రానున్న ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యేగా గెలిచి సత్తాచాటనున్నారన్నారు. అలాంటి వ్యక్తిని కనీసం ఒక్కసారి కూడా ఎమ్మెల్యేగా గెలవలేని వంశీకృష్ణ, వార్డు కార్పొరేటర్ స్థాయి లేని ఉమారాణి దూషించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా అలాంటి వ్యక్తిగత దూషణలు మానుకోవాలని హితవు పలికారు. లేకుండా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా నాయకులు పీలా జోషిలా, ఒమ్మి పోలరత్నం, పిల్లా సత్యవతి, చందక రత్నం, కె.శిరీష, కె.సంధ్య, పార్వతి, సకీనా, వెంకటలక్ష్మి, శశికళ పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన పాలనే జగనన్న లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

బీచ్ రోడ్డు: రాష్ట్రంలోని ప్రజలకు మెరుగైన పాలన అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. ఆదివారం 22వ వార్డులోని సిద్ధార్థనగర్ ప్రాంతవాసులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రజలందరికీ మేలు జరిగేలా వివిధ సంక్షేమ ఫలాలను నిజాయితీగా నిష్పక్షపాతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందించారన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిందన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని, అందుకు తూర్పు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు..

సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన

రూ.25 లక్షల జీవీఎంసీ నిధులతో తలపెట్టిన సామాజిక భవన నిర్మాణానికి ఎంపీ ఎంవీవీ శంకుస్థాపన చేశారు. వార్డు అభివృద్ధిలో భాగంగా అనేక నిర్మాణాలను పూర్తి చేశామని ఆయన తెలిపారు. సామాజిక భవనం వీలైనంత వేగంగా నిర్మాణం పూర్తి చేయాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు.

అదనపు అంతస్తు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కార్పొరేటర్ ముచ్చల లక్ష్మి

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పెదవాల్తేర్ కాగితాల వారి సామాజిక భవనం అదనపు అంతస్తు పనులకు విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎంపీ నిధులతో తలపెట్టిన ఈ పనులకు కార్పొరేటర్ ముచ్చల లక్ష్మితో ఆయన శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ 20వ వార్డు అధ్యక్షుడు కాగితాల రవికిరణ్‌రెడ్డి, పెదవాల్తేర్ పెద్దలు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, బీఎల్‌ఏలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత సంస్కృతి, నాగరికతపై అవగాహన అవసరం



డాక్టర్ వామదేవ శాస్త్రిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీ కాలనీ: పాశ్చాత్య దేశాలు విశ్వసిస్తున్న భారతదేశ సంస్కృతి, నాగరికతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పండిట్ వామదేవ శాస్త్రి సూచించారు. శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'రీకన్‌స్ట్రక్టింగ్ ది కల్చరల్ హిస్టరీ ఆఫ్ భారత'అంశంపై రెండు రోజుల సింపోజియంను ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం వేదికగా నిర్వహించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధి పండిట్ వామదేవ శాస్త్రి మాట్లాడుతూ భారతదేశం గొప్ప, సజీవమైన నాగరికతను కలిగి ఉందన్నారు. అయితే చాలా మంది పాశ్చాత్య చరిత్రకారులు భారత సంస్కృతిని వక్రీకరించి రాశారన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రాచీన చరిత్ర మూలాలను, నాగరికతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవడంతో పాటు ప్రపంచానికి అందించాలన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాధాకుమారి మాట్లాడుతూ భారత చరిత్రకారులు రాసిన మనదేశ చరిత్ర కొంత మేర వెలుగులోకి రాలేదన్నారు. ఈ నేపథ్యంలో శివానంద సుపథ ఫౌండేషన్ ద్వారా ప్రాచీన భారత చరిత్రను నేటితరానికి వెలుగులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. నేటి చరిత్రకారులు రాసిన పుస్తకాలను ప్రచురించడం, సదస్సుల ద్వారా చారిత్రక ఆధారాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆచార్య సుదర్శనరావు, ఆచార్య ఆర్. రాఘవేంద్రన్ తదితరులు పాల్గొన్నారు. పండిట్ వామదేవ శాస్త్రిని నిర్వాహకులు సత్కరించారు.

ఘనంగా నిత్యానంద ప్రభువు జయంతి



నిత్యానంద భగవానుడికి క్షీరాభిషేకం చేస్తున్న హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధులు



స్వామికి పూజ చేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఆరిలోవ: హరేకృష్ణ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఏయూ కేవీ గోపాలరావు థియేటర్‌లో ఆదివారం సాయంత్రం నిత్యానంద ప్రభువు జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ప్రతిమలకు క్షీర, జలాభిషేకాలతో పాటు వివిధ రకాల పూలతో పూజలు చేశారు. హరినామ సంకీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవచనాలు, మంగళహారతి, ప్రసాద వితరణ నిర్వహించారు. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధి యదురాజ దాస మాట్లాడుతూ ద్వారకా యుగంలో బలరాముడే నిత్యానంద ప్రభువుగా అవతరించినట్టు చరిత్ర చెబుతోందన్నారు. సుమారు 500 సంవత్సరాల క్రితం పశ్చిమ బెంగాల్‌లో కృష్ణ చైతన్య మహాప్రభు అనుచరుడిగా నిత్యానంద అవతరించినట్టు తెలిపారు. ఇద్దరూ కలిసి హరేకృష్ణ మహా మంత్రంతో కూడిన హరినామ సంకీర్తనను ప్రచారం చేసి భారతదేశమంతటా భక్తి ఉద్యమంతో ప్రభంజనం సృష్టించారన్నారు. ఈ సందర్భంగా సప్త నదుల నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలం, పంచామృతం, పంచగవ్య, సువాసనలతో కూడిన పుష్పాలు, పండ్ల రసాలతో స్వామికి అభిషేకాలు చేశారు.

పద్య, గేయ రచయితలకు సత్కారం



రచయితలను సత్కరిస్తున్న ఆచార్య బేతవోలు, డాక్టర్ రఘురామారావు

సీతంపేట: ఇటీవల తానా నిర్వహించిన పద్య, గేయ కావ్యాల పోటీల్లో విజేతలకు సత్కార కార్యక్రమం విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఘనంగా జరిగింది. మొదటి స్థానం గెలుపొందిన పద్యకావ్యం 'జీవన వాహిని' రచయిత బులుసు వెంకటేశ్వర్లు, 'యువావతరణము' గేయ కవిత్వాన్ని రచించిన రాంభట్ల నృసింహశర్మ, 'సామాజిక త్రిశతి' శతక కర్త సిహెచ్.చిన సూర్యనారాయణలను ముఖ్య అతిథి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం చేతుల మీదుగా దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా బేతవోలు మాట్లాడుతూ తానా సంస్థ చేస్తున్న సాహిత్య సేవ ప్రశంసనీయమని, ఇటీవల పుస్తక ప్రచురణ కూడా పెద్ద ఎత్తున చేపట్టిందన్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి రచనలను నాలుగు సంపుటాల్లో ప్రచురించిందని గుర్తుచేశారు. సమాజానికి మేలుచేసే ఆధునిక ఇతివృత్తంతో తానా నిర్వహించిన పద్య, గేయ రచనల్లో విశాఖకు చెందిన ముగ్గురు రచయితలు చేసిన రచనలు ఉత్తమమైనవిగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. జీవన వాహిని పద్య కావ్యం రచయిత అద్భుతమైన పద్య రచనా శైలిని ఆద్యంతం ప్రతిబింబిస్తుందన్నారు. భారతీయ జీవన విధానంలో వచ్చిన మార్పులపై అలవోకగా అనుప్రాశలతో యువావతరణము గేయ కావ్యం ఆకట్టుకుందన్నారు. డాక్టర్ రఘురామారావు మాట్లాడుతూ అద్భుత రచనలు చేసిన ముగ్గురు పండితులను సత్కరించే అవకాశం విశాఖ రసజ్ఞ వేదికకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అరసం అధ్యక్షుడు ఉప్పల అప్పలరాజు, పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

కుర్తాళం పీఠాధిపతికి ఘన స్వాగతం

సీతంపేట: అమృతోత్సవం పేరిట నిర్వహిస్తున్న శ్రీలలితా పీఠం 75వ వార్షికోత్సవంలో పాల్గొనేందుకు కుర్తాళం పీఠాధిపతి, జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆదివారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి వచ్చారు. కుర్తాళం నుంచి వచ్చిన స్వామీజీ, శక్తి పీఠాధీశ్వరి రామ్యానంద భారతీ స్వామినిలకు పీఠం వేద పండితులు, అర్చకులు పూర్ణకుంభం, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి దారి పొడుగునా పూలతో ఆహ్వానించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు పీఠాధిపతి సమక్షంలో అమృతోత్సవాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

నేడు మాజీ ఉప రాష్ట్రపతి రాక

సీతమ్మధార: సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో సోమవారం నిర్వహించనున్న గోల్డెన్ జూబ్లీ క్లోజింగ్ సెలబ్రేషన్స్‌కు ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు విచ్చేయనున్నారని స్కూల్ ప్రిన్సిపాల్ మనోజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పాఠశాల వద్దకు చేరుకుని వేడుకల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపటి నుంచి విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు



ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌ని ఆనుకొని హనుమంతవాక వద్ద విజయదుర్గా కాలనీలో కొలువుదీరిన విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ వరకు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఆవరణలో విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఇందులో భాగంగా 20న ఉదయం 6 గంటల నుంచి సుప్రభాత సేవ, విఘ్నేశ్వర పూజతో ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలు అనంతరం పెదగదిలి వద్ద పోలమాంబ గుడి నుంచి 108 కలశాలతో మహిళలు విజయ దుర్గాకాలనీ వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ అమ్మవారికి క్షీరాభిషేకం చేయనున్నారు. సాయంత్రం అమ్మవారి పల్లకి సేవ నిర్వహించనున్నారు. 21న సామూహిక లక్ష కుంకుమార్చనలు, 22న మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదానం, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, జాతర నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎస్.ఎన్.రాజు తెలిపారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అర్చకులు అందజేశారు.

చదవని పుస్తకాలను డొనేట్ చేయండి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్ తదితరులు

సీతంపేట: సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో గ్రంథాలయ గాంధీ వెలగా వెంకటప్పయ్య 9వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక పురస్కారాన్ని ఉంద్రాజవరం గ్రంథపాలకుడు నున్న వెంకట రామారావుకు ఆచార్య పి.బాలమోహన్‌దాస్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.మూర్తి రచించిన 'డెవలప్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ అండర్ సీఎస్ఆర్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పబ్లిక్ లైబ్రరీల పరిస్థితి ఇబ్బందికరంగా ఉందన్నారు. దీనికి కారణం ఫిజికల్ బుక్స్‌కు ప్రత్యామ్నాయంగా డిజిటల్, ఎలక్ట్రానిక్ బుక్స్ వచ్చాయని చెప్పారు. చేతిలో మొబైల్ ఉంటే గూగుల్ చేస్తే అన్ని పుస్తకాలు మన వద్ద ఉన్నాయన్న భావన పాఠకులు, విద్యార్థుల్లో కనిపిస్తోందన్నారు. పుస్తకాన్ని చదువుతుంటే వచ్చే ఆనందం.. మొబైల్, కంప్యూటర్స్‌లో చదివితే రాదన్నారు. కంపెనీలు తమ లాభాల్లో కొంత భాగాన్ని సీఎస్ఆర్ కింద పబ్లిక్ లైబ్రరీల అభివృద్ధికి ఇచ్చేలా సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ సంస్థ కృషి చేసిందని కొనియాడారు. విశాఖ పౌర గ్రంథాలయం అభివృద్ధే దీనికి నిదర్శనమన్నారు. చాలా మంది వద్ద పుస్తకాలు చదవకుండా ఉన్నాయని, వాటిని ప్రజలకు ఇచ్చేలా బుక్ డొనేషన్ క్యాంపెయిన్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో వెలగా రవోత్తమరావు, ఎం.కోటేశ్వరరావు, సాంబశివరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా ఎస్ఐ శ్రీను

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లు, పాత నేరస్తులకు సీఐ విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని యాక్టివ్‌గా ఉన్న రౌడీలను హెచ్చరించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకుంటున్నారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడికి వెళ్లినా పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలని వారితో అన్నారు. మీరు నివసించే ప్రాంతాల్లో అల్లర్లు సృష్టిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.